క్లుప్తంగా

పార్టీలో బాలినేనికి సముచిత స్థానం

నెల్లూరు (దర్గామిట్ట): వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసులురెడ్డి తమ పార్టీలో సీనియర్ నాయకుడని, ఆయనకు ఎప్పుడూ తగిన గౌరవం ఉంటుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఈ సందర్భంగా బాలినేని వ్యవహారంపై విలేకరులు అడిగిన ప్రశ్నకు మంత్రి కాకాణి స్పందించారు. బాలినేని శ్రీనివాసులురెడ్డికి పార్టీలో సముచిత స్థానం ఉంటుందన్నారు. ఆయన రీజనల్ కోఆర్డినేటర్‌గా తప్పుకున్నారన్నది సోషల్ మీడియా ప్రచారమేనన్నారు. బాలినేని వ్యవహారం టీ కప్పులో తుఫాన్‌లాంటిదని ఆయన అభిప్రాయపడ్డారు.

సీఎండీకు వినతి



నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ కే సంతోషరావును వైఎస్సార్ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు తిరుపతిలోని ఆయన కార్యాలయంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎండీకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జూనియర్ ఇంజినీర్స్ కన్వేర్షన్, కంప్యూటర్ ఆపరేటర్ల వేతనాలు, జూనియర్ లైన్‌మెన్ గ్రేడ్-2 ఉద్యోగులకు బయోమెట్రిక్ అటెండెన్స్ మినహాయింపు, 15ఏళ్ల దాటిన వాహనాలను నిలిపివేయడంతో డ్రైవర్లు పడుతున్న ఇబ్బందులపై సీఎండీకి వినతి పత్రం అందజేశారు. స్పందించిన సీఎండీ త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని యూనియన్ జిల్లా కార్యదర్శి శివయ్య తెలిపారు. సీఎండీని కలిసిన వారిలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోటేశ్వరరావు, డిస్కం అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, కార్యదర్శి బాలాజీ, హరనాథ్, ప్రవీణ్, మల్లి, తదితరులు ఉన్నారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

నెల్లూరు (దర్గామిట్ట): గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీజేఏసీ అమరావతి నెల్లూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. అమరావతి జేఏసీ చైర్మన్ అల్లంపాటి పెంచల్‌రెడ్డి, సెక్రటరీ ప్రసాద్ మాట్లాడుతూ గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. నాయకులు మురళీ, ఈవీఎం శరత్‌బాబు, బాబూరావు, రాజేష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



నెల్లూరు (దర్గామిట్ట): జిల్లాలో అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రైతు సంఘాల అధ్యక్షుడు చిరసాని కోటిరెడ్డి కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో జేసీ కూర్మనాథ్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. కందుకూరు, కావలి డివిజన్లలోని పలు గ్రామాల్లోని మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. వరి పంట సైతం దెబ్బతిందని తెలిపారు. నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. 2021-22 సంవత్సరంలో మొదటి పంట కాలంలో పీపీసీల ద్వారా వరిధాన్యం అమ్మిన రైతులకు రావాల్సిన రవాణా, హమాలీ చార్జీలను వెంటనే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట నాయకులు సోమశేఖర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

యువకులకు బెయిల్ మంజూరు చేయాలి

నెల్లూరు(బృందావనం):ఎన్ఆర్సీ,సీఏఏ, ఎన్‌పీఆర్‌ను రద్దు చేయాలని కోరుతూ చేపట్టిన ఆందోళనల్లో జైలుపాలై ఇబ్బందులు పడుతున్న యువకులను కేంద్రం విడుదల చేయాలని జిల్లా ముస్లిం యూత్ సేవా కమిటీ, యంగ్ ఇండియా ఫౌండేషన్ నిర్వాహకులు ఖాలిద్, ఇర్షాద్ కోరారు. జెండావీధి కోటమిట్ట కూడలిలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వేలాదిమంది యువకులు జైళ్లలో ఇబ్బందులు పడుతున్నారని, వారి పట్ల ప్రధాని నరేంద్రమోదీ దయ చూపి బెయిల్ మంజూరు చేయాలని కోరారు. ఆయా సంస్థల సభ్యులు సుభాన్, షాజు, ముస్తాఖ్, సాదిఖ్, తదితరులు పాల్గొన్నారు.

2న వాహనాల వేలం

కోవూరు : కోవూరు సెబ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో సీజ్ చేసిన మూడు వాహనాలను మే 2న బహిరంగ వేలం వేయనున్నట్లు సెబ్ సీఐ నరహరి తెలిపారు. శనివారం స్థానిక సెబ్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వేలంలో పాల్గొనే వారు ముందుగా దరఖాస్తు చేసుకుని అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని కోరారు.

తప్పుడు రాతలు రాస్తే బుద్ధి చెబుతాం

• నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): 'జర్నలిజం గౌరవప్రదమైన వృత్తి. జర్నలిజం ముసుగులో కొందరు జర్నలిస్టులు దిగజారి, అమ్ముడుపోయి తప్పుడు రాతలు రాస్తున్నారు.అలా రాయడం మంచిపద్ధతి కాదు. రాజకీయ నాయకులపై అనవసరంగా తప్పుడు రాతలు రాసే వారికి తగిన బుద్ధి చెబుతాం' అని నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్ హెచ్చరించారు. నగరంలోని 6వ డివిజన్ సాలివీధి, కంసాలి వీధి, పప్పులవీధి, తదితర ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం ఆయన నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు. తొలుత సాలివీధిలో రూ.20 లక్షలతో నిర్మించనున్న డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్‌కుమార్ మాట్లాడుతూ సర్వేపల్లి కాలువ పనులు నత్తనడకన సాగుతున్నాయని ఓ పత్రికలో రాయడం సిగ్గు చేటన్నారు. కరోనా సమయంలో కూడా పనులు జరిగాయన్నారు. ప్రస్తుతం సర్వేపల్లి కాలువ ఆయకట్టు రైతులు రెండో పంటకు సాగునీరు అడగడంతో విడుదల చేస్తున్నారన్నారు. ఈ కారణంగా నిర్మాణ పనులు ఆలస్యమయ్యాయన్నారు. కాలువలో నీరు ఉన్న సమయంలో జ్ఞానం ఉన్నవారు ఎవరైనా కాంక్రీట్ పనులు చేయగలరా? అని ప్రశ్నించారు. ఇప్పటికే సర్వేపల్లి కాలువ నిర్మాణ పనులు 75 శాతం పూర్తయ్యాయని తెలిపారు. సర్వేపల్లి కాలువకు నీటి విడుదలను నిలిపిన వెంటనే నిర్మాణ పనులు చేపడుతామన్నారు. కాలువ పనుల కోసం రైతులను ఇబ్బంది పెట్టలేమన్నారు. ఓ పత్రికకు సంబంధించిన విలేకరి డబ్బులు ఇవ్వకపోతే వార్తలు రాస్తామని బెదిరించడంపై ఆ పత్రికలోని కొందరు సిబ్బందికి డిసెంబర్‌లో లేఖ సైతం రాశామన్నారు, ఇలాంటి పత్రికలో ఇష్టానుసారం వార్తలు రాయడం సిగ్గుచేటన్నారు. రాజకీయ నాయకులపై అనవసరంగా బురదజల్లితే తగిన బుద్ధి చెప్పే రోజు త్వరలో వస్తుందన్నారు. ఏదైనా తాను తప్పు చేసి ఉంటే ఏ పనిచేయలేదో చెప్పాలని, ప్యాకేజీలు తీసుకుని తనకు వ్యతిరేకంగా ఇష్టానుసారంగా వార్తలు రాస్తే మాత్రం సహించదేది లేదని హెచ్చరించారు. కార్పొరేటర్ మద్దినేని మస్తానమ్మ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి సన్నపురెడ్డి పెంచలరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

'జగనన్నే మా భవిష్యత్తు' విజయవంతం



మాట్లాడుతున్న కొండ్రెడ్డి రంగారెడ్డి

నెల్లూరు రూరల్: రూరల్ నియోజకవర్గంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని విజయవంతం చేసినట్లు విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి తెలిపారు. నగరంలోని ఎంపీ, రూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్ రెడ్డి కార్యాలయంలో జగనన్నే మా భవిష్యత్తు ముగింపు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ రూరల్ నియోజకవర్గంలో 1.10లక్షల గృహాలు ఉండగా, 98వేల గృహాలను పార్టీ నాయకులు, వలంటీర్లు గృహసారథులు సందర్శించి ప్రభుత్వ పనితీరుపై ప్రజల అభిప్రాయాలను సేకరించినట్లు తెలిపారు. 64వేల మంది ప్రభుత్వానికి మద్దతు తెలుపుతూ తమ ఫోన్ ద్వారా మిస్డ్ కాల్స్ ఇచ్చారని చెప్పారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పాలనపై ప్రజలు ఎంతో నమ్మకంతో ఉన్నారన్నారు. పార్టీ నాయకులు వైవీ రామిరెడ్డి, రైల్వే బోర్డు సభ్యుడు వెంకయ్య, మాలెం సుధీర్‌రెడ్డి, రవి, మర్రిపాడు జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, పెంచలరెడ్డి, పరమేశ్వరరెడ్డి, కమలాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

అనధికార మద్యం విక్రయాలపై దాడులు

• ముగ్గురు నిందితుల అరెస్ట్



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

నెల్లూరు(క్రైమ్): అనధికార మద్యం విక్రయాలపై చిన్నబజారు పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. 98 క్వార్టర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వివరాలు..మూలపేట గొల్లవీధికి చెందిన కే కృష్ణకుమార్ శివగిరికాలనీలో టీ షాప్ నిర్వహిస్తున్నాడు. ఆయన గత కొంతకాలంగా గుట్టుచప్పుడు కాకుండా అనధికార మద్యం విక్రయాలు సాగిస్తున్నారు. ఇరుకళల పరమేశ్వరి గుడి సమీపంలో నివాసం ఉంటున్న పీ వెంకటరమణ, ఎం వంశీకృష్ణ సైతం అనధికారికంగా మద్యం విక్రయాలు సాగిస్తున్నారు. దీనిపై చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ ఏ సురేంద్రబాబుకు పక్కా సమాచారం అందింది. ఆయన పర్యవేక్షణలోఎస్సై సైదులు తన సిబ్బందితో కలిసి శుక్రవారం రాత్రి దాడులు చేశారు. కృష్ణకుమార్ వద్ద 11, వెంకటరమణ, వంశీకృష్ణ వద్ద 87క్వార్టర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్ట్ చేశారు. ఈ దాడుల్లో ఏఎస్సై శ్రీహరి, హెడ్‌కానిస్టేబుళ్లు సురేష్, నరసయ్య, కానిస్టేబుళ్లు శ్యామ్, దేవా, సింగ్, పుల్లయ్య పాల్గొన్నారు.


పురిటి బిడ్డలకు బేబీ కిట్ల పంపిణీ



బేబీ కిట్లు అందజేస్తున్న లయన్స్ క్లబ్ ఆఫ్ ప్రియదర్శిని సభ్యులు

నెల్లూరు(మినీబైపాస్): లయన్స్ క్లబ్ ఆఫ్ ప్రియదర్శిని నెల్లూరు ఆధ్వర్యంలో దర్గామిట్టలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలోని ప్రసూతి విభాగంలోని 50 మంది పురిటి పిల్లలకు బేబి కిట్లను శనివారం పంపిణీ చేశారు. బాలింతలకు పౌష్టికాహారం అందజేశారు. పెద్దాస్పత్రి అభివృద్ధి కమిటీ కోఆర్డినేటర్ లక్ష్మీసునంద ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి నెలా పేద రోగులకు సాయం అందిస్తున్న ప్రియదర్శిని క్లబ్ సభ్యులను అభినందించారు. ప్రాజెక్ట్ చైర్మన్ సుప్రియ, క్లబ్ పూర్వపు అధ్యక్షురాలు అరుణ, కోశాధికారి కళ్యాణి, పార్థసారథి, ఆస్పత్రి అడ్మినిస్ట్రేటివ్ అధికారి డాక్టర్ కళారాణి, దాతలు కృష్ణప్రియ, రామ్‌ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం పార్వతి పరిణయ అలంకారోత్సవం



నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో వసంతోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి పార్వతి పరిణయ అలంకారోత్సవాన్ని విశేషంగా నిర్వహించారు. ఉభయకర్తగా పేటేటి సుబ్రహ్మణ్యం వ్యవహరించారు.

పారిశుధ్య పనుల పరిశీలన



నెల్లూరు(బారకాసు): 33వ డివిజన్ పరిధిలోని వెంగళరావునగర్ సీబ్లాక్ ప్రాంతంలో పారిశుధ్య పనులను మేయర్ స్రవంతి జయవర్ధన్ శనివారం పరిశీలించారు. గృహ వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పడేయకుండా శానిటేషన్ సిబ్బంది ఇళ్ల వద్దకు వచ్చినప్పుడే అందజేయాలని స్థానికులకు సూచించారు. కుక్కలు, పందులు, కోతుల బెడద లేకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక కార్పొరేటర్ కరణం మంజులనాయుడు, స్థానిక నాయకులు, కార్పొరేషన్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీతారామాలయం నూతన కమిటీ ఎన్నిక



నెల్లూరు(బృందావనం): హరనాథపురం 2వ వీధిలోని సీతారామాలయం నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. నూతన చైర్మన్‌గా పసుపులేటి గంగాధర్, కార్యనిర్వాహక చైర్మన్‌గా మద్దాళి శ్రీధర్, న్యాయసలహాదారుడికి బసిరెడ్డి శ్రీనివాసులరెడ్డితో పాటు మరో 14 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆలయాభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు.

చలివేంద్రం ప్రారంభం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని నగరంలోని పుత్తా ఎస్టేట్ ప్రధాన ద్వారం వద్ద ప్యూర్ స్మైల్ సేవా సంస్థ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని సేవా సంస్థ నిర్వాహకురాలు పర్వీన్, బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి శనివారం ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేశారు. సేవా సంస్థ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నేడూ విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఆదివారం సెలవు దినమైనప్పటికీ విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చని ఏపీఎస్పీ డీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ వెంకటసుబ్బయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు యథావిధిగా పనిచేస్తాయని చెప్పారు. అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన

నెల్లూరు(బృందావనం): మెక్లిన్స్‌రోడ్డు విరాట్‌నగర్‌లోని జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో 330వ వార్షిక ఆరాధన మహోత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు పట్టణ విశ్వబ్రాహ్మణ సేవా సంఘం శాశ్వత వ్యవస్థాపక అధ్యక్షుడు కందుకూరు చెంగయ్యఆచారి, ప్రధాన కార్యదర్శి ఇందుకూరు రమేష్‌కుమార్‌ఆచారి శనివారం తెలిపారు. ఉదయం 5 నుంచి రాత్రి 9గంటల వరకు విశేష పూజలు, హోమాలు, సహస్ర దీపాలంకరణ సేవ విశేషంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు తెలిపారు.

నేటి నుంచి ఆదిశంకరుని స్మరణోత్సవాలు

నెల్లూరు(బృందావనం): నగరంలోని సండేమార్కెట్ ఎదురువీధిలోని ఆదిశంకర ధ్యానమందిరంలో ఆదివారం నుంచి మే 6వ తేదీ వరకు ఆదిశంకర భగవత్పాదుల సంస్మరణోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆ మందిర కమిటీ మేనేజింగ్‌ట్రస్టీ చక్రాల ఆనందకుమార్, మేనేజర్ చక్రాల వేంకటలక్ష్మీనరసింహం శనివారం తెలిపారు. ప్రతిరోజూ సాయంత్రం 6గంటల నుంచి బ్రహ్మశ్రీ గుడ్లదొన వెంకటసాయిఆంజనేయ వరప్రసాదరావుచే సుందరకాండ ప్రవచనం ఉంటుందని వివరించారు. శంకర భగవత్పాదులను భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

పెన్షనర్లు ఈకేవైసీ చేయించుకోవాలి

నెల్లూరు(మినీబైపాస్): రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ శనివారం ఒక ప్రకటనలో సూచించారు. విశ్రాంత ఉద్యోగులు ట్రెజరీ ద్వారా ఈకేవైసీ చేయించుకోవాలని తెలిపారు.

మన్‌కీ బాత్‌కి ఆహ్వానం

నెల్లూరు(మినీబైపాస్): నగరంలోని శివాజీ సెంటర్‌లో భారత ప్రధాని నరేంద్ర మోదీ వందో మన్ కీ బాత్‌కార్యక్రమాన్ని ఆదివారం ఉదయం 11 గంటలకు భారీ తెరపై ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీ సురేందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు ప్రధాని ప్రసంగాన్ని వీక్షించి విజయవంతం చేయాలని కోరారు.

బుల్లెట్ అపహరణ

నెల్లూరు(క్రైమ్): ఇంటి ముందు పార్కింగ్ చేసిన బుల్లెట్ అపహరణకు గురైన ఘటనపై వేదాయపాళెం పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. వివరాలు..చంద్రమౌళినగర్‌కు చెందిన టీ నాగరాజు ఈ నెల 9న రాత్రి తన బుల్లెట్‌ను ఇంటి ముందు పార్క్‌చేసి నిద్రపోయారు. మరుసటి రోజు ఉదయం లేచిచూడగా బుల్లెట్ కనిపించలేదు. ఈ మేరకు బాధితుడు వేదాయపాళెం పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు.

శ్రీరాములు మృతికి సంతాపం

నెల్లూరు(మినీబైపాస్): కసుమూరు పీహెచ్‌సీ హెల్త్‌ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ శ్రీరాములు శనివారం మృతి చెందారు. ఆయన మృతికి హంస అధ్యక్ష, కార్యదర్శులు చేజర్ల సుధాకర్, కమల్ కిరణ్ ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. శ్రీరాములు ఆత్మకు శాంతి చేకూరాలని దేవుడ్ని ప్రార్థించారు.

పారిశుధ్యం మెరుగునకు సహకరించాలి



మైపాడుగేట్ వద్ద పారిశుధ్యంపై స్థానికులకు సూచనలు చేస్తున్న కమిషనర్ వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్ పరిధిలో పారిశుధ్య మెరుగునకు ప్రజలు సహకరించాలని కమిషనర్ వికాస్‌మరమ్మత్ కోరారు. కార్పొరేషన్ పరిధిలోని 3,4 డివిజన్లకు సంబంధించి జాఫర్‌సాహెబ్‌కాలువ, మైపాడుగేట్ ప్రాంతాల్లోని సచివాలయాల శానిటేషన్ మస్టర్ పాయింట్లను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ క్లీన్ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా కార్పొరేషన్ పరిధిలో ప్రణాళికాబద్ధంగా ఇంటింటి చెత్త సేకరణ చేపడుతున్నామని తెలిపారు. నగర ప్రజలు గృహ వ్యర్థాలను రోడ్లపై పడేయకుండా తడి, పొడి చెత్తను వేర్వేరుగా పారిశుధ్య సిబ్బంది ఇంటి వద్ద కొచ్చినప్పుడే అందజేయాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో గృహ వ్యర్థాలను పడేస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అనంతరం సచివాలయాల రిజిష్టర్లను తనిఖీ చేశారు. కమిషనర్ వెంట ఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ, శానిటరీ సూపర్ వైజర్లు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

గృహనిర్మాణాలు వేగవంతం చేయాలి

జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని కమిషనర్ వికాస్‌మర్మత్ అధికారులను ఆదేశించారు. అక్కచెరువుపాడు ప్రాంతంలోని జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలను కమిషనర్ సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు.

సచివాలయాల తనిఖీ

నగర పాలక సంస్థ పరిధిలోని 50/1 ఖాజీపేట, 50/2 కామాక్షినగర్‌కట్ట, 52/1 ఇసుకడొంక, 52/2 గోపురంవీధి వార్డు సచివాలయాలను కమిషనర్ వికాస్ మర్మత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయాల రికార్డులను పరిశీలించారు. పెండింగ్ సేవలను గడువులోగా పూర్తి చేయాలని, సాంకేతిక అంశాలపై నేరుగా సూచనలు పొందాలని సిబ్బందికి సూచించారు.

షాదీమంజిల్ పరిశీలన

కోటమిట్ట ప్రాంతంలోని షాదీమంజిల్‌ను కమిషనర్ వికాస్‌మర్మత్ పరిశీలించారు. పేద ముస్లింలు శుభకార్యాలు చేసుకునేందుకు అధునాతనంగా మూడు అంతస్తులతో నిర్మించిన షాదీమంజిల్ ప్రాంగణం అత్యంత పరిశుభ్రంగా ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, రెవెన్యూ విభాగ ఆర్‌ఓ సమద్, ఇంజినీరింగ్ విభాగ ఈఈ చంద్రయ్య, ఏఈ మాధవి పాల్గొన్నారు.

రీసైక్లింగ్‌కు అనువుగా చెత్త సేకరణ చేపట్టాలి

నెల్లూరు రూరల్: రీసైక్లింగ్‌కు అనువుగా ఉండేలా చెత్త సేకరణ చేపట్టాలని నగర కమిషనర్ వికాస్‌మర్మత్ సూచించారు. నెల్లూరు రూరల్ పరిధిలోని దొంతాలిలోని చెత్త డంపింగ్ యార్డ్‌ను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలోని చెత్తను సేకరించే కార్మికులు తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. తడి చెత్తను వర్మీకంపోస్టుగా మార్చడం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆధునిక రీసైక్లింగ్ ద్వారా చెత్త నిల్వలను నిర్మూలించాలన్నారు. ఆయన వెంట ఇంజినీరింగ్ అధికారులు ఉన్నారు.

అన్నపూర్ణాదేవిగా శ్రీమహాలక్ష్మి



అన్నపూర్ణాదేవి అలంకారంలో మహాలక్ష్మి

నెల్లూరు(బృందావనం): పప్పులవీధిలోని శ్రీమహాలక్ష్మి దేవస్థానంలో వార్షిక వసంత పరిమళ కొలాయి మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి మహాలక్ష్మి అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా పాదర్తి బాలసుబ్రహ్మణ్యం,సామ్రాజ్యం దంపతులు వ్యవహరించారు. ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు శ్రీరాంవెంకటసురేష్, రవి, పీ నరేంద్రప్రసాద్, ఎస్ బాలాజీ, పప్పులవీధి మిత్రమండలి, మహిళామండలి, ఆలయ ఈఓ పీవీకే హేమచంద్రరావు పర్యవేక్షించారు.

కంచి కామకోటి పీఠాధిపతికి ఆహ్వానం



నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సూచనలు చేసేందుకు కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామిని శనివారం ఆహ్వానించినట్లు ఆ దేవస్థానం ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి తెలిపారు. తిరుపతిలోని కంచి మఠంలో శంకర విజయేంద్ర సరస్వతి స్వామిని కలుసుకుని ఆహ్వానించామని చెప్పారు. ఆయన వెంట ఆలయ ప్రధానార్చకుడు రఘురామమూర్తి, ధర్మకర్తల మండలి సభ్యులు జీ దొరబాబు, ఎం రామమోహన్‌రెడ్డి ఉన్నారు.

జీజీహెచ్ అభివృద్ధికి రూ.16 లక్షలు విడుదల



ఆస్పత్రిలో తనిఖీలు నిర్వహిస్తున్న సూపరింటెండెంట్ సిద్ధానాయక్

నెల్లూరు(అర్బన్): జిల్లా సర్వజన వైద్యశాల(జీజీహెచ్)లో లిఫ్టులు, ఇతర పరికరాల మరమ్మతులకు కలెక్టర్ హరినారాయణన్ రూ.16 లక్షలు విడుదల చేశారని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్ తెలిపారు. శనివారం ఆయన ఆస్పత్రిలోని మరమ్మతులకు గురైన లిఫ్టులను పరిశీలించారు. అనంతరం ప్రయోగశాలను సందర్శించి మరమ్మతులకు గురైన రక్తపరీక్షలకు సంబంధించిన ఆటో అనలైజర్ మెషిన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ సిద్ధానాయక్ మాట్లాడుతూ గత కొంతకాలంగా లిఫ్టులు అన్ని మరమ్మతులకు గురవుతున్నాయన్నారు. కలెక్టర్ చొరవతో ఒకే దఫా 9 లిఫ్టులను సిద్ధం చేయించి రోగులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చేస్తామన్నారు. రక్తపరీక్షలకు సంబంధించిన ఆటో అనలైజర్ మెషిన్‌కు మరమ్మతులు చేయించి అన్ని రకాల రక్త పరీక్షలను అందుబాటులోకి తెస్తామని తెలిపారు. ఆయన వెంట అడ్మినిస్ట్రేటివ్ అధికారి డాక్టర్ కళారాణి, తదితరులు ఉన్నారు.

కళాంజలి నృత్య పురస్కారం ప్రదానం



నగర ఎమ్మెల్యే అనిల్‌కు సత్కారం

నెల్లూరు(బృందావనం): కళాంజలి సాంస్కృతిక సంస్థ వార్షిక వేడుకల్లో భాగంగా కొరియోగ్రాఫర్ చైతన్యకు కళాంజలి నృత్య అవార్డును శనివారం రాత్రి ప్రదానం చేశారు. పురమందిరంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను కళాంజలి సంస్థ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ప్రపంచ నృత్య దినోత్సవం సందర్భంగా స్థానిక కళాకారులు శాస్త్రీయ, జానపద, సినీ నృత్యాలను ప్రదర్శించారు. కార్పొరేటర్ మొయిళ్ల గౌరి, నేతాజీ సుబ్బారెడ్డి, శుభమస్తు షాపింగ్‌మాల్ అధినేత బయ్యా శ్రీనివాసులు, ఆర్య వైశ్య బులియన్ మర్చెంట్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మట్టా ప్రసన్నాంజనేయులు, బీసీ నాయకుడు డీ సుబ్రహ్మణ్యం, కళాంజలి సాంస్కృతిక సంస్థ నిర్వాహకులు ఎన్ బలరామయ్యానాయుడు, అనంత్, డీ బెనర్జీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపంపిణీ వ్యవస్థను మెరుగుపరచండి



మాట్లాడుతున్న డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు

నెల్లూరు(పొగతోట): చౌకదుకాణాల ద్వారా జరుగుతున్న ప్రజా పంపిణీ వ్యవస్థను మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలని డీఎస్‌ఓ టీ వెంకటేశ్వర్లు సీఎస్‌డీటీలను ఆదేశించారు. శనివారం జిల్లా పౌర సరఫరాల శాఖ కార్యాలయంలో సీఎస్‌డీటీలు, ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి సకాలంలో చౌకదుకాణాలకు బియ్యం, ఇతర సరుకుల సరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థలో అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 6ఏ కేసులు నమోదైన సందర్భంలో ఆయా చౌకదుకాణాల్లో ఉన్న రేషన్‌ను పక్క దుకాణానికి అప్పగించాలన్నారు. ఈ విషయంలో జాప్యం వల్ల రేషన్ పంపిణీ ఆలస్యమవుతుందన్నారు. చౌకదుకాణాలకు సంబంధించి పంపిణీ చేయగా మిగిలిన స్టాక్‌ను పరిశీలించి మరుసటి నెలకు అవసరమైన రేషన్ సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలన్నా రు. స్పందన కార్యక్రమం ద్వారా వస్తున్న అర్జీలను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. ఈ విషయంలో అలసత్వం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఎస్‌ఓ అంకయ్య, తదితరులు పాల్గొన్నారు.